సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం ¦ 27 ¦ సెప్టెంబర్ ¦ 2024



కిలో టమాట రూ.46

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.46, కనిష్టం రూ.27 ప్రకారం ధర పలికింది.



ఆధ్యాత్మిక ఖ్యాతి.. పర్యాటక దీప్తి

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాలను అధికారులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

8లో

గరిష్టం/కనిష్టం
33.8°/22.9°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

నేతలకు పంగనామాలే!



ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజలతో పాటు టిక్కెట్లు దక్కని టీడీపీ ముఖ్యనేతలకు కూడా సీఎం చంద్రబాబు హామీలు గుప్పించారు. నామినేటెడ్ పోస్టుల్లో అందరికీ న్యాయం చేస్తామని నమ్మబలికారు. తీరా ఆయా పదవుల ఎంపికలో వారికీ పంగనామాలు పెట్టారు. ఇక.. కూటమి ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న బీజేపీ, జనసేన నాయకులను అసలు లెక్కలోకి కూడా తీసుకోకపోవడంతో వారంతా అసంతృప్తితో రగిలిపోతున్నారు.

- నామినేటెడ్ పదవుల్లో జిల్లాకు దక్కని ప్రాధాన్యం
- చంద్రబాబు వైఖరిపై కూటమిలోని మూడు పార్టీల్లోనూ అసమ్మతి సెగలు
- పార్టీ కోసం కష్టపడినా గుర్తింపు లేదని మండిపాటు
- సీటు త్యాగం చేసినా ఫలితం లేదంటోన్న 'తమ్ముళ్లు'
- నామినేటెడ్ పదవుల్లో జిల్లాలో విజయ్‌కుమార్‌కు మాత్రమే అవకాశం

సాక్షి, పుట్టపర్తి: నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెట్టుకున్న వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు షాక్ ఇచ్చారు. జిల్లాలో ఏ ఒక్కరికీ ప్రాధాన్యం ఇవ్వలేదని ఆశావహులు వాపోతున్నారు. ఎన్నికలకు ముందు పార్టీని గెలిపిస్తే.. ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తానని భరోసా ఇచ్చి నామినేటెడ్ పదవుల భర్తీలో నట్టేట ముంచారని సీనియర్లు వాపోతున్నారు. ఈ నేపథ్యంలోనే పెనుకొండ, ధర్మవరం, మడకశిరలో అసమ్మతి నేతలు చంద్రబాబు తీరుపై అసమ్మతి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు పూర్తయి అధికారంలోకి వచ్చాక.. పట్టించుకోవడం లేదని సన్నిహితులు, బంధువులు, అనుచరుల వద్ద వాపోయినట్లు తెలిసింది. టీడీపీతో పాటు మిత్రపక్షాలయిన జనసేన, బీజేపీకి ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వలేదని మండిపడుతున్నారు. నామినేటెడ్ పదవుల్లో మిత్రపక్షాలకు సరైన గుర్తింపు లేదని.. సరైన సమయంలో సత్తా చాటుతామని మిత్రపక్షాల నేతలు చెబుతున్నారు. రూ.కోట్లు గుమ్మరించి.. ఎన్నికల్లో పని చేస్తే.. నిలువునా మోసం చేశారని బాధపడుతున్నారు. కుల సమీకరణాల ప్రకారం కూడా ఎవరికీ న్యాయం జరగలేదంటున్నారు.

నిమ్మల కిష్టప్పకు షాక్..

పెనుకొండ నియోజకవర్గంలో టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి నిమ్మల కిష్టప్ప నామినేటెడ్ పదవి ఇస్తారని ఆశపడ్డారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే లేదా ఎంపీ టికెట్ ఇస్తారని భావించారు. కానీ సవిత, పార్థసారథి పట్టుబట్టడంతో ఆ ఇద్దరికీ ఇచ్చి.. కిష్టప్పకు ప్రభుత్వం వచ్చాక న్యాయం చేస్తామని చంద్రబాబు, లోకేశ్ హామీ ఇచ్చారని సమాచారం. ప్రస్తుత నామినేటెడ్ పదవుల్లో నిమ్మల కిష్టప్ప పేరు ప్రస్తావనకు కూడా రాకపోవడం గమనార్హం. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శేఖర్ కూడా పెనుకొండకు చెందిన వారే. ఆయనకు కూడా ఎలాంటి పదవి ఇవ్వలేదు. మిత్రపక్షాలను చంద్రబాబు పట్టించుకోవడం లేదని ఆయన వర్గీయులు వాపోతున్నారు.

'గుండుమల'కు గుండు సున్నా..

మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి నామినేటెడ్ పోస్టుల తొలి జాబితాలోనే పదవి వస్తుందని అందరూ అనుకున్నారు. అంతేకాకుండా గత నెలలో పింఛన్ల పంపిణీ కోసం సీఎం హోదాలో చంద్రబాబు... తిప్పేస్వామి స్వగ్రామం గుండుమలకు కూడా వచ్చారు. ఈ నేపథ్యంలో తిప్పేస్వామికి పదవి ఖాయమన్న ప్రచారం జోరుగా సాగింది. కానీ బీసీ వర్గాన్ని అణగదొక్కాలనే ఉద్దేశంతోనే గుండుమల తిప్పేస్వామికి పదవి ఇవ్వలేదని ఆయన అనుచరులు వాపోతున్నారు. మాజీ ఎమ్మెల్యే ఈరన్న కుటుంబానికి కూడా తీరని అన్యాయం జరిగిందని ఆయన అనుచరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విర్రవీగినా ఫలితం శూన్యం

ధర్మవరం నియోజకవర్గంలో కూటమిలోని మూడు పార్టీల్లో కీలక నేతలుగా వ్యవహరిస్తున్న వారిలో ఒక్కరికి కూడా నామినేటెడ్ పదవి దక్కలేదు. బీజేపీ తరఫున కోటి సూర్యప్రకాశ్‌బాబు, జనసేన తరఫున చిలకం మధుసూదన్‌రెడ్డి, టీడీపీ తరఫున పరిటాల శ్రీరామ్, రెడ్డి సామాజిక వర్గం కోటాలో కుణుతూరు వేణుగోపాల్‌రెడ్డి నామినేటెడ్ పదవి ఆశించారు. అయితే ముగ్గురికీ కాదని.. మాజీ ఎమ్మెల్యే కుమారుడు గోనుగుంట్ల విజయ్‌కుమార్ ఓ పదవి కట్టబెట్టారు. కూటమి తరఫున ధర్మవరంలో విర్రవీగే నాయకులందరికీ చంద్రబాబు పంగనామాలు పెట్టారని ప్రచారం జరుగుతోంది.

సీటు త్యాగం చేసినా ఫలితం ఏదీ?

మడకశిర ఎమ్మెల్యే సీటు త్యాగం చేసిన సునీల్ కుమార్‌కు ఎలాంటి పదవి రాలేదు. ధర్మవరం సీటు త్యాగం చేసిన పరిటాల శ్రీరామ్ పేరు అసలు ప్రస్తావనే లేదు. జిల్లాలో జనసేనకు ఏకైక దిక్కుగా ఉన్న చిలకం మధుసూదన్‌రెడ్డికి కూడా ప్రాధాన్యం దక్కలేదు. హిందూపురంలో గడ్డం నాగరాజు, జేసీఎస్ కుమారుడు అనిల్ నామినేటెడ్ ఆశించి భంగపడ్డారని ఆ పార్టీ వర్గీయులు చెబుతున్నారు. అదే విధంగా పుట్టపర్తిలో బీసీ కోటాలో పీసీ గంగన్న, రామాంజినేయులు నామినేటెడ్ పదవి ఆశించినా ప్రయోజనం లేకపోయిందని అంటున్నారు.

న్యూస్‌రీల్

జిల్లా టెన్నిస్ జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం: స్కూల్ గేమ్స్ సెలెక్షన్స్‌లో భాగంగా లాన్‌టెన్నిస్, సాఫ్ట్‌టెన్నిస్ అండర్-14, అండర్-17 బాలురు, బాలికల జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు బి. సుగుణమ్మ, డి. మొరార్జీ యాదవ్ తెలిపారు. గురువారం అనంతపురంలో నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి దాదాపు 100 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. త్వరలో రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలు కాకినాడలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

హంద్రీనీవా ఎస్ఈ దేశేనాయక్ బదిలీ

అనంతపురం సెంట్రల్: రాష్ట్ర వ్యాప్తంగా నీటి పారుదల శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. జిల్లాలో 75 మంది ఏఈలను, 23 మంది డీఈలకు స్థానచలనం కలిగింది. హంద్రీనీవా ఇన్‌చార్జ్ ఎస్ఈ(హెచ్ఎన్ఎస్ఎస్ డివిజన్-7 ఈఈ) దేశేనాయక్‌ను నెల్లూరుకు బదిలీ అయ్యారు. చిన్ననీటి పారుదలశాఖ ఇన్‌చార్జ్ ఎస్ఈగా పనిచేస్తున్న (ఈఈ, అనంతపురం) సి. ప్రతాప్‌ను నంద్యాల కేసీ కెనాల్ డివిజన్ ఈఈగా బదిలీ చేశారు. అలాగే హెచ్ఎల్‌సీ డీఎస్ఈ సునీల్‌నాయక్‌ను తిరుపతి సీఈ ఆఫీసు డీఎస్ఈగా, ధవళేశ్వరం ప్రాజెక్టులో ఈఈగా పనిచేస్తున్న సూర్య భాస్కర శర్మను హెచ్చెల్సీ డీఎస్ఈగా నియమితులయ్యారు. హెచ్చెల్సీ లోకలైజేషన్ ఈఈగా కర్నూలు చిన్ననీటి పారుదలశాఖ ఈఈగా పనిచేస్తున్న రెడ్డిశేఖరరెడ్డిని నియమించారు.

మోడల్ స్కూల్‌ను సందర్శించిన రాష్ట్ర పరిశీలకులు



రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకులు

పుట్టపర్తి అర్బన్: ప్రపంచ బ్యాంకు సహకారంతో బోధనా నైపుణ్యాలపైన ఇచ్చిన శిక్షణ ఎలా సద్వినియోగం అవుతుందో పరిశీలించేందుకు టెక్ టూల్ స్టేట్ అబ్జర్వర్లు కిషోర్, అబ్రహాం లింకన్ శుక్రవారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి మోడల్‌స్కూల్‌ను సందర్శించారు. జులైలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు, సీఆర్‌పీలకు బోధనా నైపుణ్యాల అభివృద్ధి చేసేందుకు సాల్ట్ (సపోర్టివ్ ఆంధ్రాస్ లర్నింగ్ ట్రాన్స్‌ఫర్‌మేషన్) లో భాగంగా 10 రోజుల పాటు ప్రపంచ బ్యాంకు సహకారంతో శిక్షణ ఇచ్చారు. ఇందులో నాలుగు డివిజన్‌లకు చెందిన ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడు, ఒక సీఆర్పీకి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణను పాఠశాలల్లో అమలు చేస్తున్నారా లేదా అనే విషయాలపై పరిశీలించేందుకు వారు వచ్చారు. ఆయా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో కలిసి పాఠాలు విన్నారు. టెక్ టూల్ ఎలిమెంట్స్, పద్ధతులు వివరించారు. అనంతరం పాఠశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

లావణ్య పాలీ క్లినిక్ సీజ్



ఆస్పత్రిని సీజ్ చేస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: నగరంలో రామచంద్ర నగర్‌లోని లావణ్య పాలీ క్లినిక్‌ను డీఎం హెచ్ఓ డాక్టర్ ఈ.భ్రమరాంబ దేవి గురువారం సీజ్ చేశారు. కూడేరు మండలం హంసపల్లి గ్రామానికి చెందిన వేలూరు రాధకు ఇటీవల కడుపు నొప్పి రావడంతో వైద్యం కోసం లావణ్య పాలీ క్లినిక్‌కు వెళ్లారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో విధులు నిర్వర్తించే అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమణా నాయక్ ఆమెకు ఆపరేషన్ చేయగా అది వికటించింది. దీంతో భర్త రామానాయుడు, కుటుంబీకులు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో డీఎం హెచ్ఓ భ్రమరాంబ దేవి క్లినిక్‌లో ప్రాథమిక విచారణ చేపట్టారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యం జరిగినట్లు తేలడంతో క్లినిక్‌ను సీజ్ చేశారు. శస్త్రచికిత్స వికటించిన విషయమై విచారణకు ముగ్గురు ప్రొఫెసర్లతో కూడిన కమిటీ వేసినట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. కమిటీ నివేదిక ఆధారంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమణా నాయక్‌పై తదుపరి చర్యలుంటాయని ఆమె పేర్కొన్నారు.

నేటి సాయంత్రంలోగా ఈ-కేవైసీ పూర్తి చేయండి

- జిల్లా వ్యవసాయాధికారి వైపీ సుబ్బారావు



బత్తలపల్లిలోని ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

బత్తలపల్లి: జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈ పంట ఈ-కేవైసీని శుక్రవారంలోపు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వైపీ సుబ్బారావు సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని మాల్యవంతం గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ గ్రామ వ్యవసాయాధికారితో ఈ-కేవైసీపై సమీక్ష నిర్వహించారు. అనంతరం వైపీ సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో శుక్రవారం సాయంత్రంలోపు ఈ-కేవైసీ పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం బత్తలపల్లికి చేరుకొని శ్రీహనుమాన్ ఫర్టిలైజర్స్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసి ఎరువులు, పురుగు మందులను రైతులకు అవసరం మేరకు మాత్రమే ఇవ్వాలని సూచించారు. మందులు కొన్న ప్రతి రైతుకు రసీదు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఏడీఏ కృష్ణయ్య, జిల్లా రిసోర్సు సెంటర్ ఏడీఏ విద్యావతి, మండల వ్యవసాయాధికారి ఓబిరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి ఉపేంద్రరెడ్డి, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్ల ఎంపికకు నేడు ఇంటర్వ్యూలు

హిందూపురం: జిల్లా తపాలా శాఖలో భాగమైన తపాలా జీవిత బీమా పీఎల్ఐ, గ్రామీణ తపాలా జీవిత బీమా ఆర్‌పీఎల్ఐ డైరెక్ట్ ఏజెంట్లుగా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హిందూపురం డివిజన్ తపాలా సూపరింటెండెంట్ తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు 27వ తేదీ నుంచి ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హిందూపురం విడి రోడ్డులోని ప్రధాన తపాలా సూపరింటెండెంట్ కార్యాలయంలో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. ఆర్‌పీఎల్ఐ ఏజెంట్లుగా ఎంపిక కావడానికి 10వ తరగతి పాస్ అయి 18 నుంచి 50 సంవత్సరాలలోపు ఉన్నవారు ఇంటర్వ్యూకు హాజరుకావచ్చన్నారు. ఎంపిక సమయంలో ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, రెండు ఫొటోలు తీసుకురావాల్సి ఉంటుందన్నారు. సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.5 వేలు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఏజెంట్లుగా తొలగిపోయే సమయంలో తిరిగి ఆ డబ్బు వెనక్కి ఇస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం సెల్ నెంబర్ 9441823899, 85200 99939లను సంప్రదించాలన్నారు.

13 మండలాల్లో వర్షం

ప్రశాంతి నిలయం: జిల్లా వ్యాప్తంగా బుధవారం రాత్రి వరకూ 13 మండలాల పరిధిలో 55.4 మి. మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. గోరంట్లలో 16 మి. మీ, సోమందేపల్లి 6.2, గుడిబండ 5.2 , తనకల్లు 5.2 , ముదిగుబ్బ 4.2 , పరిగి 3.2 ,నల్లమాడ 2.6 ,మడకశిర 2.6 ,ధర్మవరం 2.4 , పుట్టపర్తి 2.4 ,తలుపుల 2.0 , అమడగూరు 2.0 , బత్తలపల్లి 1.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 13 మండలాల్లో వర్షపాతం నమోదైందన్నారు. 1.7 సగటు వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

యథేచ్ఛగా మట్టి దందా!

- కొండ, గుట్టలను కరిగించేస్తున్న తమ్ముళ్లు
- నిద్రమత్తులో అధికారులు



సున్నపుగుట్టతండా వద్ద టిప్పర్‌లో అక్రమంగా తరలిస్తున్న మట్టి

కదిరి అర్బన్: కదిరి మండలంలో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. కొందరు టీడీపీ నాయకులు గ్రూపులుగా ఏర్పడి అక్రమంగా మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం వందలాది టిప్పర్లతో కదిరి మండలంలోని తుమ్మల రోడ్డు సమీపంలోని దుర్గమ్మ గుడి గుట్ట, పర్తిగడ్డ సమీపంలో కొండగుట్టల తవ్వేస్తున్నారు. మట్టిని పట్టణంలోని అక్రమ లేఅవుట్లకు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. రోజూ సుమారు ఆరేడు టిప్పర్లతో వందకుపైగా లోడ్ల మట్టిని తరలిస్తున్నారు. టిప్పర్ రూ.1500తో లెక్కేసినా రోజూ రూ.1.50 లక్షలు అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. ఇక ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు వచ్చిన రోజైతే మట్టిమాఫియాకు పండగే.

నిద్రమత్తులో అధికారులు..

కదిరి మండలంలో మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. నిత్యం వందలాది టిప్పర్ల మట్టిని అక్రమంగా తరలిస్తుంటే మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖాధికారులు ఏం చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త వాహనాలు కొనుగోలు..

మట్టి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుండటంతో మట్టి మాఫియా కొత్త వాహనాలు (జేసీబీ, హిటాచీ) సైతం కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. అధికార పార్టీలో ఉన్నాం కాబట్టి ఎవరికీ బెదిరేదిలేదని బాహాటంగానే చెబుతున్నారు. పోలీస్, రెవెన్యూ అధికారులతో కూడా మాట్లాడుకున్నామని చెబుతుండటం గమనార్హం.

పట్టుబడితే కఠిన చర్యలు



కార్యాలయ పనుల నిమిత్తం విజయవాడకు తరచూ వెళ్లాల్సి వస్తోంది. దీన్ని అదునుగా చేసుకుని మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. మట్టి అక్రమ రవాణా చేస్తున్న వారిని పట్టుకోవాలని కుమ్మరవాండ్లపల్లి వీఆర్‌ఓను ఆదేశించాము. అక్రమంగా మట్టి తరలిస్తూ పట్టుబడితే భారీ జరిమానాలు విధిస్తాం.

– మురళీకృష్ణ, తహసీల్దార్, కదిరి

రామగిరిలో రెచ్చిపోతున్న తమ్ముళ్లు

- ఎంసీ పల్లి సచివాలయంపై ఫొటోల తొలగింపు
- కుంటిమద్దిలో ఆలయానికి పసుపు రంగు
- పరిటాల అండతో చెలరేగుతున్న టీడీపీ శ్రేణులు



ఎంసీ పల్లిలో సచివాలయంపైకి ఎక్కి శిలా ఫలకాలను తొలగిస్తున్న టీడీపీ నేతలు

సాక్షి,టాస్క్‌ఫోర్స్: అధికారంలో ఉన్నామనే అహంకారంతో టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. మరీ ముఖ్యంగా రామగిరి మండలంలో గత సార్వత్రిక ఎన్నికల తర్వాతి నుంచి ఏదో గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై టీడీపీ నేతలు దాడులకు తెగబడుతూనే ఉన్నారు. రెండురోజుల క్రితం ఎంసీ పల్లి గ్రామంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో పాటు శిలాఫలకాన్ని టీడీపీ నేతలు ధ్వంసం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పరిటాల కుటుంబం అండచూసుకునే టీడీపీ నేతలు రామగిరిలోని ఏదో ఓ గ్రామంలో అలజడి సృష్టిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇదిలా ఉండగా నాలుగు రోజుల క్రితం ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న విత్తనాలను తీసుకునేందుకు పెద్ద కొండాపురంలోని రైతు భరోసా కేంద్రానికి కొందరు రైతులు వెళ్లగా 'మీరు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు మీకివ్వమంటూ' తెలుగు తమ్ముళ్లు బెదిరింపులకు దిగారు. ఆఖరికి ఆలయాలను కూడా టీడీపీ నేతలు వదిలి పెట్టడం లేదు. కుంటిమద్దిలో వీరనారప్ప దేవాలయానికి పసుపు రంగు పూసి ఆ గ్రామంలో అలజడిని సృష్టించేందుకు ప్రయత్నించారు. ఇక.. ఏ ప్రభుత్వ కార్యాలయానికి వైఎస్సార్‌సీపీ నాయకులు వెళ్లకుండా కొందరు అధికారులకు తెలుగు తమ్ముళ్లు హుకుం జారీ చేస్తున్నారు. అసలు మనం భారతదేశంలోనే ఉన్నామా లేక పాకిస్తాన్‌లో ఉన్నామా అనే భావన కలిగించేలా రామగిరిలోని టీడీపీ నేతలు ప్రవర్తిస్తుండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. రామగిరి మండలంలో తొమ్మిది పంచాయతీలుండగా ఏడు పంచాయతీ సర్పంచుతో పాటు తొమ్మిది ఎంపీటీసీ స్థానాలను వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు గెల్చుకోవడాన్ని జీర్ణించుకోలేని పరిటాల కుటుంబం ఇలాంటి దారుణాలకు పాల్పడుతోందన్న విమర్శలు సర్వతా వినిపిస్తున్నాయి.

• వైభవంగా హర్యాలీ తీజ్ ఉత్సవాలు



చివరి రోజు సంప్రదాయ నృత్యం చేస్తున్న బంజారా మహిళలు

వజ్రకరూరు: మండలంలోని రూపానాయక్ తండాలో హర్యాలీ తీజ్ ఉత్సవాలు గురువారం ముగిశాయి. ఈ నెల 16న ప్రారంభమైన ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో గిరిజనులు నిర్వహిస్తూ వచ్చారు. చివరి రోజూ వేడుకలకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలు, తెలంగాణ, కర్ణాటక, రాజస్తాన్ తదితర ప్రాంతాల నుంచి బంజారాలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో రూపానాయక్ తండా కిక్కిరిసింది. గురువారం ఉదయం తీజ్ వేడుకల్లో భాగంగా గ్రామంలో సంత్ సేవాలాల్ మహారాజ్, సామా సంగ్‌మహారాజ్, తుల్జాభవానీ తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సంప్రదాయ నృత్యాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో అధికారులు, బంజారా ప్రతినిధులు, వివిధ ర్టీల నా యకులు, బంజారా పీఠాధిపతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- కలెక్టర్ టీఎస్ చేతన్



పాల్గొన్న వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. గురువారం జిలా కలెక్టరేట్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి క్లెయిమ్ సెటిల్మెంట్ కమిటీ, రోడ్ సేఫ్టీ కమిటీ సమీక్షా సమావేశాన్ని కలెక్టర్ టీఎస్ చేతన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల్లో మరణాలు తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మద్యం తాగి రోడ్డుపై వాహనాలు నడిపే వారిమీద కేసు నమోదు చేసి జైలు శిక్ష పడేటట్లు చేయాలన్నారు. ప్రమాదాలు తరచుగా జరిగే ప్రదేశాలను గుర్తించి కమిటీ ద్వారా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారులు, కూడళ్లు, దాబాలు, రెస్టారెంట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. జిల్లాలోని అన్ని హైవేలకు సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు.రోడ్డు భద్రత కోసం ప్రతి మూడు నెలలకు ఒక సారి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్‌రావు, జిల్లా రవాణా అధికారి కరుణాసాగర్‌రెడ్డి, కదిరి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎన్‌హెచ్ఏ అధికారి భరత్, డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి, డీఈఓ మీనాక్షి, డీసీహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, ఆర్అండ్‌బీ ఎస్ఈ సంజీవరావు, పంచాయతీరాజ్‌శాఖ మురళీమోహన్, ఆర్టీసీ జనరల్ మేనేజర్ మధుసూదన్‌లతో పాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీ రన్నరప్‌గా జిల్లా జట్టు



రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన జిల్లా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: రాష్ట్రస్థాయి సీనియర్ బాలికల ఫుట్‌బాల్ టోర్నీ రన్నరప్‌గా జిల్లా జట్టు నిలిచింది. ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ సంఘం, ఏపీ ఫుట్‌బాల్ సంఘం (ఏపీఎఫ్ఏ) సంయుక్త ఆధ్వర్యంలో కానూరులోని అనుమోలు ప్రభాకర్ ప్లే ఫీల్డ్‌లో మూడురోజులపాటు అత్యంత రసవత్తరంగా జరిగిన ఈ పోటీల్లో 12 జిల్లాల జట్లు పాల్గొన్నాయి. గురువారం తొలి సెమీ ఫైనల్‌లో కర్నూలుతో తలపడగా 0–0తో మ్యాచ్ డ్రా అయింది. పెనాల్టీ కిక్స్‌లో 5–4 తేడాతో కర్నూలుపై జిల్లా జట్టు విజయం సాధించింది. అనంతరం అనంతపురం జిల్లా జట్టుతో ఫైనల్‌లో శ్రీ సత్యసాయి జిల్లా జట్టు తలపడింది. 4–0తో ఓడిపోవడంతో రన్నరప్‌గా నిలిచింది. అనంతపురం జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ పోటీలను ఏపీఎఫ్ఏ కార్యదర్శి డానియేల్ ప్రదీప్ పర్యవేక్షించారు. విజేతలకు అనుమోలు ప్రభాకర్, కె.బాలకృష్ణ, ఏపీఎఫ్ఏ ఉపాధ్యక్షులు ముని శ్రీనివాసరావు, కోశాధికారి విజయ్, ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షకార్యదర్శులు శేషగిరిరావు, చక్రవర్తి ట్రోఫీలు అందజేసి అభినందించారు.

ఆధ్యాత్మిక ఖ్యాతి.. పర్యాటక దీప్తి

- జిల్లాలో పర్యాటక వెలుగులు
- చరిత్రకు సాక్షిగా నిలిచిన ప్రాంతాలు
- నేడు సాయి ఆరామంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం

పుట్టపర్తి టౌన్: జిల్లాకు పర్యాటక శోభ వచ్చింది. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాలను అధికారులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఓ వైపు ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతూనే మరో వైపు చరిత్రకు సాక్షిగా నిలిచిన కట్టడాలు, ప్రకృతీ రమణీయతకు అద్దం పట్టే ఎన్నో దృశ్యాలు దేశవిదేశీ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని శుక్రవారం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో అధికారికంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.

ప్రపంచ ఆధ్యాత్మిక ధామం..

జిల్లా కేంద్రం పుట్టపర్తిని సందర్శిస్తే ఎవరైనా ఆధ్యాత్మిక చింతనలో పడాల్సిందే. అబ్బుర పరిచే నిర్మాణాలు, హాయి గొలిపే వాతావరణం, అడుగడుగునా సాయి నామస్మరణం పర్యాటకులకు కొత్త అనుభూతినిస్తోంది. ఇక్కడి చైతన్య జ్యోతి మ్యూజియం, నక్షత్రశాల, హిల్ వ్యూ స్టేడియం, డీమ్డ్ యూనివర్సిటీ, పంచముఖ ఆంజనేయస్వామి, ప్రశాంతి నిలయం, చిత్రావతి నది ప్రత్యేక దర్శనీయ ప్రదేశాలు.



లేపాక్షిలోని ఏడుపడగల నాగేంద్రుడు



పుట్టపర్తిలోని నక్షత్రశాల

ఆహ్లాదాన్ని పంచే కొండలు..

జిల్లాకు అతి సమీపంలో కర్ణాటక సరిహద్దున ఉన్న నంది కొండలు ప్రకృతి రమణీయతతో పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. నంది కొండ నుంచి కిందకు చూస్తే మేఘాల పైనుంచి చూస్తున్నట్లుగా ఉంటుంది.

వారసత్వ కట్టడం..

హిందూపురానికి 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న లేపాక్షి వారసత్వ కట్టడాలకు నిలయంగా మారింది. ఇక్కడి వీరభద్రస్వామి ఆలయం ప్రపంచ వారసత్వ కట్టడాల తాత్కాలిక జాబితాలో చోటు దక్కించుకుంది. ఆలయంలో కట్టడాలు అబ్బుర పరుస్తుంటాయి. వేలాడే స్తంభం, ఏడుపడగల నాగేంద్రుడు, వటపత్రసాయి చిత్రం ప్రధానంగా పర్యాటకులను భక్తులను ఆకర్శిస్తోంది.టిక్కడ నందీశ్వరుడి ఏకశిలా విగ్రహం దేశంలోనే అతిపెద్దదిగా ఖ్యాతి గాంచింది.

విజయనగర రాజుల దుర్గం..

విజయనగర రాజుల వైభవానికి, నాటి చరిత్రకు పెనుకొండ దుర్గం అద్దం పడుతోంది. కొండపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం, తిమ్మరుసు బంధిఖానా, దిగువన ఉన్న గగన్‌మహల్, బాబయ్యదర్గా, కుంభకర్ణ విగ్రహం, పార్శ్వనాథుని ఆలయాలు భక్తులను, పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి.

నేడు సాయి ఆరామంలో...


ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పుట్టపర్తిలోని సాయి ఆరామంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు పర్యాటక శాఖ అధికారి జయకుమార్ బాబు తెలిపారు. పర్యాటక రంగంపై విద్యార్థులకు అవగాహన సదస్సుతో పాటు క్విజ్, వ్యాసరచన పోటీలు ఉంటాయి. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తారు. సాయంత్రం 5 గంటలకు కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. కార్యక్రమాలకు కలెక్టర్ టీఎస్ చేతన్‌తో పాటు అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు.



తిమ్మమ్మ మర్రిమాను

దక్షిణ భారతదేశంలోనే అతి పెద్దది..

కదిరికి 28 మైళ్ల దూరంలో ఎన్పీకుంట మండలం గూటిబయలు వద్ద దక్షిణ బారతదేశంలోనే అతి పెద్దదైన తిమ్మమ్మ మర్రిమాను ఉంది. 8.75ఎకరాల్లో విస్తరించి 6.689 ఊడలతో 1989లో గిన్నీస్ బుక్ రికార్డులో చోటు దక్కించుకుంది. అలాగే కదిరిలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కటారుపల్లిలోని యోగివేమన సమాధి కూడా పర్యాటకులకు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.



పెనుకొండ కోట ముఖద్వారం

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య

కనగానపల్లి: జీవితంపై విరక్తితో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కనగానపల్లిలోని బీసీ కాలనీకి చెందిన కిష్టయ్య, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె సాకే ఇందిరమ్మ (35)కు 15 ఏళ్ల క్రితం కూడేరుకు చెందిన మలరాయుడితో వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో కొన్ని నెలల క్రితం భర్త నుంచి విడిపోయిన ఇందిరమ్మ... తన ముగ్గురు పిల్లలను తీసుకుని పుట్టింటికి చేరుకుంది. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం తండ్రి కిష్టయ్య రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆర్థిక ఇబ్బందులు నెలకొని కుటుంబ పోషణ భారమైంది. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఇందిరమ్మ గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'సాయి దర్బార్'లో సహస్ర చండీ హోమం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

పుట్టపర్తి అర్బన్: జిల్లా కేంద్రం సమీపంలోని మామిళ్లకుంట క్రాస్‌లో వెలసిన సాయి దర్బార్ ఆలయం వేదికగా సహస్ర చండీ హోమం గురువారం సాయంత్రం ప్రారంభమైంది. అమృతానందనాథ సరస్వతి జయంతిని పురస్కరించుకుని ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ హోమాన్ని నిర్వహిస్తున్నట్లు సాయి దర్బార్ ఆలయ కమిటీ అధ్యక్షురాలు సౌజన్య తెలిపారు. సుమారు 108 హోమ గుండాలను ఏర్పాటు చేసి 1008 మంది భక్తులకు అవసరమైన సామగ్రిని అందజేశారు. కామాఖ్యామృత శోధన కమిటీ రుత్వికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు గుంటూరులో ఉచిత శిక్షణ

తాడిపత్రి అర్బన్: విద్యార్థుల్లో మానసిక ప్రవర్తనా లోపాలను సరిచేసి, ఆత్మ విశ్వాసం పెంపొందించే దిశగా ఉపాధ్యాయులకు గుంటూరులో అక్టోబర్ 4, 5, 6 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు స్టూడెంట్స్, టీచర్స్, ఎడ్యూకేటర్స్, పేరెంట్స్ (స్టెప్) సమన్వయకర్తలు సత్యప్రసాద్‌రెడ్డి, సేతు రామేశ్వరరెడ్డి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నేక్కల్లులోని రమణారావు, సావిత్రమ్మ ధ్యాన ఆరోగ్య ఆశ్రమం వేదికగా శిక్షణా తరగతులు ఉంటాయి. శిక్షణలో పాల్గొనే ఉపాధ్యాయులకు ఉచిత వసతి, భోజనాలతో పాటు మెటీరియల్, సర్టిఫికెట్లు అందజేస్తారు. ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు 94904 19365, 94915 09440 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలి.

యువకుడిపై హత్యాయత్నం

రాప్తాడు రూరల్: సరదాగా మద్యం తాగిన స్నేహితుల మధ్య చోటు చేసుకున్న చిన్నపాటి వివాదం ఒకరిపై హత్యాయత్నానికి దారి తీసింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు... బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి సమీపంలోని కాలనీలో నివాసం ఉంటున్న చిన్నదేవ, అనంతపురం నగరానికి చెందిన హరీష్ స్నేహితులు. ఓ మహిళ విషయంగా ఇద్దరి మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 24న హరీష్, చిన్నదేవ.. వారి స్నేహితులతో కలసి అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి సమీపంలో ఉన్న ఓ తోటలో మందు పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. ఫూటుగా మద్యం సేవించిన తర్వాత చిన్నదేవ, హరీష్ మధ్య సదరు మహిళ విషయం చర్చకు వచ్చింది. అది చినికిచినికి గాలివానలా మారడంతో హరీష్ తన స్నేహితులతో కలసి చిన్నదేవపై దాడికి పాల్పడ్డాడు. తలపై రాయితో బాది, కట్టెలతో విచక్షణారహితంగా దాడి చేశారు. చిన్నదేవకు కాలు విరిగింది. తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అది చూసి భయపడిన స్నేహితులు అక్కడి నుంచి పరారయ్యారు. రాత్రి 11 గంటల సమయంలో మెలుకువ వచ్చిన బాధితుడు తనను కాపాడాలంటూ గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని తోటలో ఉన్న రైతు గమనించి డయల్ 100కు సమాచారం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న అనంతపురం రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సిల్క్ పరిశ్రమ ఎదుట కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న చేనేత కార్మికులు, కమ్యూనిస్టు నేతలు

బత్తలపల్లి: నిబంధనలకు విరుద్ధంగా మరమగ్గాలపై చేనేత ఉత్పత్తులను నేస్తున్న జేఆర్ సిల్క్స్ పరిశ్రమ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలంటూ ఏపీ చేనేత కార్మిక పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనలో భాగంగా బత్తలపల్లి మండలం వేల్పుమడుగు క్రాస్ వద్ద ఉన్న జేఆర్ సిల్క్స్ పరిశ్రమ వద్ద కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో చేనేత కార్మికులు గురువారం ధర్నా చేపట్టారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్, జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, మాధవస్వామి, పిల్లలమర్రి బాలకృష్ణ, శివదుర్గారావు, జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలూరి రుషింగప్ప తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జేఆర్ పరిశ్రమ నిర్వాహకుల అక్రమాలపై నిగ్గు తేల్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మిక సంఘాలు ఏకమయ్యాయన్నారు. దాదాపు 200 జెట్ స్పీడ్ మగ్గాలు ఏర్పాటు చేసి చేనేత ఉత్పత్తులను మరమగ్గాలపై నేస్తూ చేనేత వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. చేనేత ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాన్ని ధర్మవరంలో ఏర్పాటు చేసేలా జిల్లా మంత్రులు చొరవ తీసుకోవాలని డిమాండ్‌చేశారు. అనంతరం ఫ్యాక్టరీలోకి బలవంతంగా ప్రవేశించేందుకు ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, జిల్లా కార్యదర్శి మారుతి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోలా లక్ష్మీనారాయణ, వెంకటనారాయణ, వెంకటస్వామి, గంగాధర్, ఏఐటీయూసీ నాయకులు రమణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జేవీ రమణ, ఎస్‌హెచ్ బాషా, ఆదినారాయణ, హరి, వెంకటస్వామి, రాజగోపాల్, నారాయణస్వామి, సీపీఐ పట్టణ కార్యదర్శి రవి, వ్యకాసం జిల్లా కార్యదర్శి కుళ్లాయప్ప, బత్తలపల్లి మండల కార్యదర్శి వెంకటేష్, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రాజా, పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరును నిరసిస్తూ మహిళా రైతు ఆత్మహత్యాయత్నం

పుట్టపర్తి: భూ వివాదంలో అధికారుల తీరును నిరసిస్తూ ఓ మహిళా రైతు ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... బుక్కపట్నం మండలం పాముదుర్తి వెంకటాపురం గ్రామానికి చెందిన రాగే నారాయణస్వామి, నిర్మల దంపతులకు అదే గ్రామానికి చెందిన వెంగప్పకు మధ్య నాలుగేళ్లుగా భూ వివాదం నడుస్తోంది. అగ్రహారం పొలంలో నారాయణస్వామి దంపతులకు 1.50 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి పక్కనే వెంగప్పకు చెందిన పొలం ఉంది. ఈ క్రమంలో నారాయణస్వామి దంపతుల భూమిలో తన భూమి కలిసిదంటూ కొన్నేళ్లుగా వెంగప్ప వివాదాలకు తెరలేపాడు. ఆ భూమి మొత్తం తనదేనంటూ నారాయణస్వామి కుటుంబ సభ్యులతో తరచూ గొడవపడేవాడు. ఈ వివాదంలో రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుని వెంగప్పకు అనుకూలంగా వ్యవహరించారు. దీంతో అధికారుల తీరును తప్పుబడుతూ గురువారం ఉదయం ఇంట్లో గొర్రెల కోసం ఉంచి పిడుదల మందును నిర్మల తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను పాముదుర్తిలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

శిశువుల మృతిపై ముగిసిన విచారణ

హిందూపురం టౌన్: స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆగస్టులో ముగ్గురు శిశువులు మృతి చెందిన అంశంపై రెండు రోజుల పాటు సాగిన విచారణ గురువారం ముగిసింది. వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాడేపల్లికి చెందిన సివిల్ అసిస్టెంట్ సర్జన్ (గైనకాలజీ) డాక్టర్ స్వప్న సింధు విచారణాధికారిగా నియమించిన విషయం తెలిసిందే. దీంతో బుధవారం హిందూపురం జిల్లాస్పత్రికి చేరుకున్న ఆమె రెండు రోజుల పాటు శిశువుల మృతి అంశంపై బాధితులు, వైద్యులు, సిబ్బందిని విడివిడిగా విచారణ చేశారు. లిఖితపూర్వకంగా వివరణ తీసుకున్నారు. మాతా శిశు కేంద్రంలోని ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. బాలింతలు, బంధువులతో మాట్లాడి పలు వివరాలను రాబట్టుకున్నారు. విచారణ నివేదికను త్వరలో ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఈ సందర్భంగా డాక్టర్ స్వప్న సింధు తెలిపారు.

రాయలసీమలో వీరబ్రహ్మేంద్రస్వామి చిత్ర షూటింగ్



మాట్లాడుతున్న నరసింహరాజు

పెనుకొండ: రాయలసీమలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర సినిమాను చిత్రీకరించనున్నట్లు రచయిత, నిర్మాత, దర్శకుడు వెంకటనరసింహరాజు తెలిపారు. గురువారం ఆయన స్థానిక బాబయ్యస్వామి దర్గాను దర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. స్వార్థ రాజకీయాల కోసం హిందూముస్లింల మధ్య ఐక్యతను చెడగొట్టేలా పాలకులు వ్యవహరిస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని కులాలు, మతాలు ఒక్కటేనని చాటిచెప్పిన మహనీయుడు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి స్ఫూర్తితో ఆయన జీవిత చరిత్రను సినిమాగా తీస్తున్నట్లు తెలిపారు. సినిమా లోకేషన్లు పరిశీలించేందుకు పెనుకొండకు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వెంట పలువురు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య



రాజేంద్రప్రసాద్ (ఫైల్)

బత్తలపల్లి: అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు... బత్తలపల్లి మండల టీడీపీ కన్వీనర్, మాల్యవంతం గ్రామానికి చెందిన గోనుగుంట్ల నారాయణరెడ్డి సోదరుడు రాజేంద్రప్రసాద్ అలియాస్ రాజు (48)కు వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో అప్పులు చేసి పంటల సాగు చేశాడు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల నష్టపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని కుటుంబసభ్యులతో చెప్పుకుని బాధపడేవాడు. ఈ క్రమంలోనే తీవ్ర మనస్తాపానికి చెందిన రాజు... ఈ నెల 15న రాత్రి 9.30 గంటలకు తమ చీనీ తోటలోని షెడ్డులో పురుగుల మందు తాగాడు. కాసేపటి తర్వాత గట్టిగా కేకలు పెట్టడంతో చుట్టు పక్కల రైతులు గమనించి ఆయనను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వైద్యుల సూచన మేరకు మెరుగన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక గురువారం తెల్లవారుజామున ఆయన మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, రాజు మృతి విషయం తెలుసుకున్న మంత్రి సత్యకుమార్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఏపీ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గోనుగుంట్ల విజయ్‌కుమార్ తదితరులు మాల్యవంతం చేరుకుని రాజు మృతదేహానికి నివాళులర్పించారు.

పోలీసుల అదుపులో ఇద్దరు



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

గుత్తి రూరల్: మండలంలోని మార్నేపల్లి గ్రామ శివారులో పంట పొలాలకు రక్షణగా ఏర్పాటు చేసిన తీగలను బుధవారం అర్ధరాత్రి అపహరించుకెళుతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని గుత్తి మండలం ఈశ్వరపల్లికి చెందిన నరసింహులు, నాగరాజుగా గుర్తించారు. ప్రస్తుతం నరసింహులు గుంతకల్లులో, అదే మండలం ఇమాంపురంలో నాగరాజు నివాసముంటున్నారు. ఇద్దరూ వ్యసనాలకు బానిసై తమ అవసరాలు తీర్చుకునేందుకు దొంగతనాలకు పాల్పడేవారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి మార్నేపల్లి గ్రామ శివారులో పంట పొలాల్లో రక్షణ తీగలు తొలగించి ఆటోలో వేసుకుని వెళుతూ పోలీసులకు పట్టుబడ్డారు. ఆటోను సీజ్ చేసి, రక్షణ తీగలను స్వాధీనం చేసుకున్నారు. తమ ఆధీనంలో ఉన్న నిందితులను పోలీసులు విచారణ చేస్తున్నారు.

జీపు దగ్ధం

అనంతపురం: నగరంలోని భవానీ నగర్ ప్రధాన రోడ్డుపై గురువారం మధ్యాహ్నం ఆపి ఉన్న జీపుపై దుండగులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. జీపు యజమాని నాగరాజు, డ్రైవర్ నవీన్ తెలిపిన మేరకు... భవానీ నగర్‌కు చెందిన డ్రైవర్ నవీన్ గురువారం తెల్లవారుజామున పేపర్ బండిళ్లను తాడిపత్రిలో అన్‌లోడ్ చేసి, మధ్యాహ్నం 12 గంటలకు భవానీ నగర్‌లోని తన ఇంటికి చేరుకున్నాడు. జీపును ఇంటి వద్దనే నిలిపి లోపల కెళ్లి నిద్రించాడు. సుమారు 12:30 గంటల సమయంలో దుండగులు జీపుపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. ఇటీవల రూ.2 లక్షలు వెచ్చించి జీపును ఆధునీకరించారని, ఘటనతో రూ.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. ఘటనపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



కాలిపోయిన జీపు లోపలి భాగం

హిందూపురం వాసికి డాక్టర్ విశ్వేశ్వరయ్య అవార్డు



కర్ణాటక సీఎం సిద్ధరామయ్య చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నరహరి

హిందూపురం: బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కళాశాలలో గురువారం జరిగిన వేడుకలో డాక్టర్ ఎం.విశ్వేశ్వరయ్య అవార్డును హిందూపురానికి చెందిన యాదాటి నరహరి అందుకున్నారు. ఆయన విద్యా సేవలను గుర్తించిన కర్ణాటక ప్రభుత్వం ఎం.విశ్వేశ్వరయ్య అవార్డుకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం ఉదయం అవార్డును కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ప్రదానం చేసి అభినందించారు.

దూడలను స్వాధీనం చేసుకున్న పోలీసులు



దూడలను స్వాధీనం చేసుకుంటున్న దృశ్యం

గోరంట్ల: కబేళాకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న 8 దూడలను సీఐ శేఖర్ స్వాధీనం చేసుకున్నారు. గురువారం గోరంట్ల మార్కెట్ యార్డులో నిర్వహించిన పశువుల సంతలో ఈ ఘటన చోటు చేసుకుంది. దూడల యాజమానుల గురించి ఆరా తీస్తే ఎవరూ ముందుకు రాకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకుని గోశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

కణేకల్లు: లారీ ఢీకొన్న ఘటనలో ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కణేకల్లు మండలం కె.కొత్తపల్లి గ్రామానికి చెందిన కంబరి తిప్పేస్వామి (50)కి భార్య తిమ్మక్క, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. గురువారం సాయంత్రం తన ద్విచక్రవాహనంపై రేకులకుంట గ్రామానికి బయలుదేరిన ఆయన రాయదుర్గం రూరల్ మండలం వేపరాల వద్దకు చేరుకోగానే వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన తిప్పేస్వామిని స్థానికులు అనంతపురంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక అదే రోజు రాత్రి ఆయన మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చీనీ మొక్కల నరికివేత

పెద్దపప్పూరు: మండలంలోని రెడ్డిపల్లిలో చీనీ మొక్కలను దుండగులు నరికి వేశారు. వరుసగా ఇలా ఐదోసారి జరగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరు... ఎందుకు ఇలా మొక్కలు నరికేస్తున్నారో అర్థం కావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు... రెడ్డిపల్లికి చెందిన మహిళా రైతు వెంకటలక్ష్మి తనకున్న 2.50 ఎకరాల్లో చీనీ మొక్కలు నాటారు. ఈ క్రమంలో ఈ ఏడాది మే 23న దుండగులు తోటలోకి చొరబడి 50 మొక్కలను నరికి వేశారు. దీంతో నరికి వేసిన మొక్కల స్థానంలో కొత్తగా మరో 50 మొక్కలను ఆమె నాటారు. గురువారం తెల్లవారుజామున మరోసారి తోటలోకి చొరబడిన దుండగులు నాలుగు నెలల వయసున్న 50 మొక్కలను నరికి వేశారు. ఘటనపై సమాచారం అందుకున్న పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్య, ఎస్‌ఐ గౌస్‌బాషా అక్కడకు చేరుకుని పరిశీలించారు. కాగా, ఏడాది క్రితం కూడా తన తోటలో మొక్కలను దుండగులు నరికివేశారని, వరుసగా మూడోసారి ఇలా జరగడంతో తీవ్రంగా నష్టపోయినట్లు బాధిత రైతు వెంకటలక్ష్మి వాపోయింది. అదే గ్రామానికి చెందిన బాలవర్ధిరాజు, బెడుదూరి భాస్కర్‌కు చెందిన తోటల్లోనూ చీనీ చెట్లను ఏడాది క్రితం దుండగులు నరికివేసినట్లు గుర్తు చేశారు. చీనీ మొక్కల నరికి వేతకు కారకులైన దుండగులను గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు బాధిత మహిళా రైతు ఫిర్యాదు చేశారు.

దళితుడి భూమిని కాజేసే కుట్ర



ప్రభుత్వం మంజూరు చేసిన సాగు పట్టాను చూపుతున్న ఓబులేసు

విడపనకల్లు: ప్రభుత్వం సాగు హక్కు కల్పించిన దళితుడి భూమిని కాజేసే కుట్రకు స్థానిక టీడీపీ నాయకులు తెరలేపారని బాధితుడు హరిజన ఓబులేసు తెలిపాడు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... 20 సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం విడపనకల్లు మండలం చీకలగురికి గ్రామానికి చెందిన దళితులకు బంజరు భూమిపై సాగు హక్కులు కల్పిస్తూ పత్రాలను పంపిణీ చేసిందన్నాడు. ఇందులో భాగంగానే అప్పట్లో సర్వే నంబర్ 60బీలో 2.84 ఎకరాల భూమికి తన భార్య హరిజన చౌడమ్మ పేరుతో సాగు హక్కు పత్రం మంజూరైందన్నాడు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కొందరు స్థానిక టీడీపీ నాయకులు తమ భూమిపై కన్నేసి కబ్జా చేసేందుకు కుట్ర చేస్తున్నారని వాపోయాడు. 20 రోజుల క్రితం కంది పంటను ట్రాక్టర్‌తో దున్ని నాశనం చేశారని గుర్తు చేశాడు. ఈ ఘటనకు సంబంధించి అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేస్తే... తాను వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడిననే ఒకే ఒక్క కారణంతో టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ అక్రమంగా తనపైనే కేసు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశాడు. అంతటితో ఆగకుండా తమకు అనుకూలంగా ఉన్న పత్రికల్లో తప్పుడు కథనాలు ప్రచురించేలా చేస్తున్నారని మండిపడ్డాడు. తనకు, తన కుటుంబానికి టీడీపీ నాయకుల నుంచి ప్రాణహాని ఉందని ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.